# స్ట్రాంగ్‌రూంలు భద్రం..

- రేపటి ఓట్ల లెక్కింపునకు అంతాసిద్ధం
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం



ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలు



ఓట్లను లెక్కించే ఐజా ఇంజినీరింగ్ కాలేజీ

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 1: ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం దాగి ఉంది. వారి భవిష్యత్‌ను తేల్చే ఈవీఎంలు స్ట్రాంగ్‌రూముల్లో భద్రంగా ఉన్నాయి. హాజీపూర్ మండలం ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఓట్లను లెక్కించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో పాటు జిల్లా అధికారులు పర్యవేక్షించారు. మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల అసెంబ్లీ స్థానానికి 17 మంది, బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి 13 మంది, చెన్నూరు నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మొత్తం 636425 మంది ఓటర్లు ఉండగా అందులో 317408 మంది పురుషులు, 318972 మంది మహిళలు, 45 మంది థర్డ్ జెండర్‌లు ఉన్నారు. 741 పోలింగ్ బూత్‌లలో ఓలింగ్‌ను గురువారం నిర్వహించారు. మంచిర్యాల నియోజకవర్గంలో 574 ఈవీఎంలు, బెల్లంపల్లి నియోజవర్గంలో 227, చెన్నూరు నియోజకవర్గంలో 227 ఈవిఎంలలో ఓటర్లు తమ ఓటును వేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తం 2,74,807 మంది ఓటర్లు ఉండగా అందులో 1,36,760 మంది పురుషులు, 1,38,022 మంది మహిళలు, 25మంది థర్డ్ జెండర్‌లు ఉన్నారు. పోలింగ్ పూర్తయ్యే సరికి 69.16 శాతం పోలింగ్ నమోదయింది. ఇందులో పురుషులు 93982 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96071 మంది మహిళలు, నలుగురు థర్డ్ జెండర్‌లు కలిపి మొత్తం 190057 మంది ఓటర్లు తమ ఓటు వేశారు. చెన్నూరు నియోజకవర్గంలో 79.97 శాతం పోలింగ్ నమోదయింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 188283 మంది ఓటర్లు ఉండగా అందులో 94074 మంది పురుషులు, 94201మంది మహిళలు, ఎనిమిది మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. ఇందులో 75513 మంది పురుషులు, 75051 మంది మహిళలు, ఇద్దరు థర్డ్‌జెండర్‌లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో మొత్తం 173335 మంది ఓటర్లు ఉండగా అందులో 86574 మంది పురుషులు, 86749 మంది మహిళలు, 12 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. ఇక్కడ 81.19 శాతం పోలింగ్ నమోదయింది. వీరిలో 70904 మంది పురుషులు, 69823 మంది మహిళలు, ఐదుగురు థర్డ్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



వైద్య విద్యార్థి శ్రీనిధికి బహుమతి అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

ఎదులాపురం, డిసెంబర్ 1 : ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఎయిడ్స్ రహిత సమజంతో పాటు బాధితులకు అండగా ఉంటామని అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రాణాంతకం కాదని, వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలన్నారు. డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు దూరం చేసినప్పుడే నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో 2008 నుంచి 2023 సంవత్సరం వరకు 4,98,654 మంది హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోగా 2,458 మందికి సోకినట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. 2023 సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 25,181 మంది పరీక్షలు చేయించుకోగా 87 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. జిల్లాలో 988 మందికి ప్రతి నెలా రూ.2016 పింఛన్ ఇస్తున్నామన్నారు. జిల్లాలో నాలుగు హెచ్ఐవీ కౌన్సెలింగ్, టెస్టింగ్ సర్వీసెస్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. డ్రాయింగ్ పోటీలో గెలుపొందిన డిగ్రీ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మాస్ మీడియా అధికారి వెంకట్ రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్లు గోపి, రవీందర్, డీపీఎంవో వామన్‌రావ్, సీహెచ్‌వో బాబాలాల్, డీపీఎం అనిల్ కుమార్, రమణాచారి, కార్యాలయ సిబ్బంది, ఆశకార్యకర్తలు, వివిధ పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**అవగాహన కల్పించాలి**

వైద్య విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రజలకు ఎయిడ్స్ నియత్రణపై అవగాహన కల్పించాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా రిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఫలితంగా వ్యాధి గ్రస్తులు సంఖ్య తగ్గుతుందన్నారు. వైద్య సేవల్లో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వైద్య విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంజరి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సరోజ, డాక్టర్ విద్యా విల్సన్, వైద్యులు విజయలక్ష్మి, రవిశంకర్, పద్మిని, సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలి**

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్ అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వసంత, హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, తదితరులున్నారు.

## ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

లక్షెట్టిపేట, డిసెంబర్ 1: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ నిర్మూలనపై సిబ్బంది అవగాహన ర్యాలీ తీశారు. ఈ సంద్భంగా దవాఖాన సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చన్నారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతూ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద ప్రారంభించి గాంధీ చౌక్ మీదుగా పాతబస్టాండ్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో దవాఖాన వైద్యులు శేఖర్, సురేశ్, పవిత్ర, శ్వేత, సిబ్బంది బుద్ధే సత్యం, కిషన్, సురేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట : అవగాహన ర్యాలీ తీస్తున్న వైద్యులు, సిబ్బంది

# కోల్‌బెల్ట్‌పైనే అభ్యర్థుల ఆశలు..

- పోలింగ్ సరళిపై ఉత్కంఠ
- అంతుపట్టని ఓటరు మనోగతం



నస్పూర్‌లో ఓటు వేయడానికి క్యూలైన్లో నిలుచున్న ఓటర్లు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 1: మంచిర్యాల నియోజకవర్గంలో గెలుపోటములను శాసించే కోల్‌బెల్ట్‌పై అభ్యర్థులు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేస్తున్నారు. 25 వార్డులు ఉన్న ఈ మున్సిపాలిటీలో 68,608 ఓటర్లు ఉన్నారు. సింగరేణి కార్మికులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో వారి ఓట్లు ఎక్కువగా ఎవరికి పడితే వారే విజేతగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కోల్‌బెల్ట్ ప్రాంతమైనా నస్పూర్ మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన నడిపెల్లి దివాకర్‌రావు, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు, బీజేపీ నుంచి పోటీ చేసిన వెరబెల్లి రఘునాథ్‌రావులు ఎక్కువగా కోల్‌బెల్ట్ ప్రాంతంలో ప్రచారం చేశారు. కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశామని, సింగరేణి కార్మికులకు అనేక హక్కులు కల్పించామంటు బీఆర్ఎస్ ప్రచారం కొనసాగించింది. సింగరేణి స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న వారికి పెద్ద ఎత్తున పట్టాలు ఇప్పించారు. ఈ అంశాలను ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. అలాగే 'ఒక్క చాన్స్ ఇవ్వండి కోల్‌బెల్ట్ ప్రాంత నస్పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం ' అంటు కాంగ్రెస్, బీజేపీలు తమ ప్రచారాన్ని కొనసాగించాయి. ప్రధానంగా ఈ మూడు పార్టీలు నస్పూర్ పట్టణంపై దృష్టి సారించడంతో ఆసక్తికరంగా వీరి ప్రచారం కొనసాగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నువ్వానేనా అన్నట్లుగా ప్రచారం చేయగా, బీజేపీ మాత్రం చాపకిందనీరులా ప్రవహిస్తూ వచ్చింది. నోటిఫికేషన్ దగ్గరి నుంచి మొదలుకొని చివరి రోజు వరకు ప్రచారమంతా కోల్‌బెల్ట్ చుట్టూ తిరిగింది. పోలింగ్‌కు ఒక రోజు ముందు ఈ మూడు పార్టీలు పోల్‌మేనేజ్‌మెంట్‌లో తలమునకలైంది. పోలింగ్ రోజు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లారు. నస్పూర్ పట్టణంలో మొత్తం 28 పోలింగ్ కేంద్రాల్లో 71 బూత్‌లను ఏర్పాటు చేయగా, అన్ని కేంద్రాల్లో తమ కార్యకర్తలను పెద్ద సంఖ్యలో మోహరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా గుర్తించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సమయాన్ని ఒక గంట ముందుకు కుదించారు. ఉదయం మందకోడిగా పోలింగ్ జరిగినా, సాయంత్రం వరకు పుంజుకుంది. రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో రాత్రి 8గంటల వరకు పోలింగ్ జరిగింది. మున్సిపాలిటీలో 60శాతం పోలింగ్ నమోదు కాగా 68,608 మంది ఓటర్లకు గాను 40,600 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ ముక్కోణపు ఫైట్ జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ పార్టీ కాంగ్రెస్ ఓట్లు చీల్చిందని, తద్వారా బీఆర్ఎస్ పార్టీకి ప్లస్ పాయింట్‌గా మారబోతుందని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ మాత్రం వన్‌సైడ్‌గా తమకే ఓట్లు ఎక్కువగా పడ్డాయని అంచనాలు వేసుకుంటున్నారు. ఓటరు మనోగతం మాత్రం అంతుపట్టడం కష్టంగా మారింది. ఈ సారి కోల్‌బెల్ట్ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారనేది 3వ తేదీ వరకు వేచిచూడాలి.

సుందరం హోమ్
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
వెబ్ సైట్: www.sundaramhome.in, CIN: U65922TN1999PLC042759
... 04 మార్చ్ 2024 ...
504 208 ... 05 మార్చ్ 2024 ...